విశాలాంధ్ర
అనకాపల్లి
సోమవారం 5, మే 2025

అక్రమ రోడ్డు నిర్మాణంపై పంచాయతీ పాలకవర్గం ఆగ్రహం

బరితెగించిన "మైన్స్ మాఫియా"పై ఉన్నతాధికారులకు ఫిర్యాదుకు సిద్ధం

విశాలాంధ్ర - అనకాపల్లి: మండలంలోని బవులువాడ పంచాయతీ పరిధిలో రావు గోపాలరావు కాలనీ వెనుక గల సర్వే నెం. 70, 74, 75లో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్కడే ప్రభుత్వ ఆధీనంలోఉన్న కొండను తవ్వి ఆ గ్రావెల్తో కొంతమంది నవీన్, రమణారెడ్డి "మైనింగ్ మాఫియా" అక్రమ రోడ్డు నిర్మాణానికి బరి తెగించారు. కొంతమంది గ్రామస్తులు, సామాజికవేత్తలు సదరు విషయంపై తహశీల్దార్కు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా ప్రజా పరిష్కార వేదికలో కలెక్టర్ కూడా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ మైనింగ్ మాఫియా అక్రమ రోడ్డు నిర్మాణ పనులను కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పంచాయతీ పాలకవర్గం, ఎంపీటీసీ సభ్యులు అక్రమంగా నిర్మించిన రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణంపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా కలెక్టర్కు ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వారు స్థానిక మీడియాతో మాట్లాడుతూ మార్టూరు సర్వే నెంబర్-1లో గల కొంతమంది క్వారీ యజమానులు వారికున్న లీజులకు, బవులువాడ పంచాయతీకి సంబంధం లేకపోయినా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కొండను తవ్వి ప్రభుత్వ భూముల్లో నుంచి భారీ రోడ్డు నిర్మాణం చేపట్టడం అధికార యాంత్రాంగానికి సవాల్ విసిరినట్లే కదా అని ప్రశ్నించారు. అక్రమ రోడ్డు నిర్మాణం పూర్తయి క్వారీ లారీలు భారీ స్థాయిలో రాకపోకలు సాగిస్తే రావు గోపాలరావు కాలనీ కాలగర్భంలో కలిసిపోవాల్సిందే. ఎందుకంటే ఆ భారీ క్వారీ వాహనాలతో పర్యావరణానికి ముప్పు కలిగి వాతావరణం కాలుష్యం అవుతుందని దీనివల్ల అక్కడి ప్రజలు నిత్యం నరకం అనుభవించలేక అనారోగ్యాలతో వలస వెళ్ళే పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డును పరిశీలించిన వారిలో ఎంపీటీసీ విజయ్, పంచాయతీ పాలకవర్గం సభ్యులు బి.రమేష్, ఎస్. వెంకటరత్నం, ఎస్.రత్నం, డి.సీతామహాలక్ష్మి, కే. పార్వతి, రెహమాన్, రమణ, కాసులు, సత్య శివ, శ్రీను, ఏ.వెంకటరావు, కాశీ తదితరులు ఉన్నారు.

5 నుండి సీపీఐ జిల్లా మహాసభలు

జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

విశాలాంధ్ర - యలమంచిలి: సీపీఐ అనకాపల్లి జిల్లా మహాసభలు యలమంచిలిలో ఈనెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు కె.సన్యాసిరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి, విశాఖ జిల్లాలో విడిపోయిన తర్వాత 2వ మహాసభలు అనకాపల్లి జిల్లాలో ఈనెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు స్థానిక గుర్రప్ప కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నామని అన్నారు. దేశ విముక్తికై సాగిన స్వాతంత్రోద్యమ కాలం నుండి బడుగు, బలహీన వర్గాలు, పేద, మధ్య తరగతి ప్రజానీకం సంక్షేమం కోసం సీపీఐ మహోజ్వల పోరాటాలు నిర్వహించిందని అన్నారు. దేశంలో కార్మిక, కర్షక, ఇతర శ్రమ జీవుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను నడపడం ద్వారా సమాజంలో గణనీయమైన మార్పులకు కృషి చేస్తుందని తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలకు హద్దు లేదు. అంతకుమునుపు రూ.70 ఉన్న పెట్రోలు రూ.112లకు, రూ.52 ఉన్న డీజిల్ రూ.100కు పైగా పెరిగిందని, రూ.400 ఉన్న గ్యాస్ సిలెండరు రూ.1100లకు చేరిందని అన్నారు. ఇంటి పన్నులు, ఆస్తి పన్నులు భారీగా పెంచాలని రాష్ట్రాలను బెదిరిస్తోందని తెలిపారు. చివరికి చెత్త మీద కూడా పన్నులు వేసేలా చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజానీకాన్ని మరింత పేదరికంలోకి నెట్టే విధంగా ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని కావున ప్రజల్లో చైతన్యం నింపడం కోసం ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

సీఐని కలిసిన పిబివిఎస్ఎన్ రాజు

విశాలాంధ్ర - సబ్బవరం: సబ్బవరం సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావుని ఆదివారం అనకాపల్లి పార్లమెంటు టిడిపి తెలుగు యువత అధ్యక్షులు పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్చం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం గ్రామ సచివాలయం ఆవరణలో అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో వాసన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు, ఎంపీటీసీ రాపేటి అరుణ రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరానికి సుమారు 95 మంది పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. 12మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించగా, 39 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించగా, 44 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దొడ్డి సూర్యప్రకాష్రావు, సి.హెచ్.దేవి, అప్పలరాజు, డా. షణ్ముఖ్, డా. రమేష్, వి.మణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి పలువురు భక్తులు తమ వంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మునగపాక గ్రామానికి చెందిన దొడ్డి జగ్గప్పారావు కుమారుడు దొడ్డి అప్పలనాయుడు రూ.10 లక్షలు విరాళం ప్రకటించి అడ్వాన్స్గా 5లక్షలు ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో మొల్లేటి సత్యనారాయణ, విల్లూరి నర్సింగరావు, బొడ్డేడ రామునాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా ఆదివారం బుక్ రీడింగ్ స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సింగబిల్లి ఎంపిపిఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సురేష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ గ్రంథాలయానికి ప్రతిరోజు వచ్చి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇంగ్లీష్ పదాల గూర్చి, గ్రామర్ గూర్చి సూచనలు ఇచ్చారు. రోజుకి ఐదు ఇంగ్లీష్ పదాలు నేర్చుకుంటే ఇంగ్లీషు చాలా వరకు నేర్చుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 14 మంది స్టూడెంట్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారి జగన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రైతు భరోసా కేంద్రానికి దారేది...!

విశాలాంధ్ర - కే.కోటపాడు: గత వైసీపీ రైతు భరోసా కేంద్రాల పేరిట ప్రజాధనాన్ని వృధా చేసింది. అధికార పార్టీ నాయకులే గుత్తేదారులుగా అవతారం ఎత్తి భవన నిర్మాణాలు చేపట్టి సరైన వసతులు లేకుండా చేశారు. ఒక్కో భవనానికి రూ.21 లక్షలు మంజూరు కావడంతో సరైన ప్రణాళిక లేకుండా ఎక్కడ స్థలం దొరికితే అక్కడ భవనాలను నిర్మించారు. కింతాడ రైతు సేవా కేంద్రానికి రహదారి లేదు. అక్కడ పనిచేయాల్సిన ఉద్యాన పశుసంవర్ధక సహాయకులు గ్రామ సచివాలయంలో ఉంటున్నారు. ఆ కేంద్రానికి రహదారి ఏర్పాటు చేయవలసిన గుత్తేదారు పట్టించుకోలేదు. అలాగే మండలంలో కొన్ని కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేదు. మరికొన్ని కేంద్రాలు ఊరికి దూరంగా ఉంటున్నాయి. అక్కడ పని చేయాల్సిన ఉద్యోగులు సౌకర్యాలు లేవంటూ సచివాలయాల్లో పని చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు సేవలు ఎలా అందుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

చోడవరం, మాడుగుల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: చోడవరం మాడుగుల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ నూతన అధ్యక్షుడిగా నమ్మి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని వడ్డాది స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చోడవరం మాడుగుల జర్నలిస్టుల సంక్షేమ సంఘం సభ్యులు సమావేశ మయ్యారు. ఈ జర్నలిస్టు సంక్షేమ సంఘానికి నూతన అధ్యక్షుడిగా అనకాపల్లి టుడే దినపత్రిక ఎడిటర్ నమ్మి శ్రీనుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నమ్మి శ్రీను మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి, అభివృధి, సంక్షేమానికి జర్నలిస్ట్ల సమస్యలు పరిష్కరానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు శరగడం రాజు, రేణం సోమినాయుడు, కెటి నాయుడు, ఎం.మోహన్, వాసు, నాగేష్, యు.తాతారావు, ఎన్.అజయ్ ప్రసాద్, ఎం.గోవింద్, పాండు, కె.చంద్రరావు, ఎస్.గణేష్, ఆర్.నాగేష్, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస కళ్యాణం కర పత్రిక విడుదల

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు ఆదివారం శ్రీనివాస కళ్యాణం కరపత్రికను విడుదల చేశారు. చోడవరం శ్రీ ఆపదహార శ్రీనివాస క్షేత్రమందు జరుగు 76వ వార్షిక కళ్యాణోత్సవానికి శ్రీవారి భక్తులు, పురజనులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 4,5,6 తేదీల్లో అధ్యయనోత్సవాలు, 7వ తేదీ అంకురార్పణ, 8వ తేదీ గురువారం సాయంత్రం తిరువీధితో ప్రారంభమై రాత్రి 7గంటలకు స్వామివారి కళ్యాణం అలాగే 11వతేదీ ఆదివారం రాత్రి 7గంటలకు లక్ష మల్లెల పూజ జరుపుతున్నట్లు ఆలయ చైర్మన్ వింజమూరి శంకర్ తెలియజేశారు. ఉత్సవ కమిటీ సూచించిన పుణ్య దంపతులచే అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు గుంటూరు శాంతారామాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ జీవీ సత్యనారాయణ, దేవరపల్లి వెంకట అప్పారావు, గూనూరు ప్రభాకర్, గనిరెడ్డి, విస్సు, ఆలయ కమిటీ కార్యదర్శి ఉపాధ్యాయుల శ్రీనివాసరావు కమిటీ సభ్యులు, కొడమంచిలి షణ్ముఖ శాస్త్రి(శ్రీనివాస్) తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్న రహదారులు - నరకానికి ఆనవాళ్లు

విశాలాంధ్ర - చోడవరం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధ్వాన్న రహదారులుతో నరకానికి ఆనవాళ్లుగా వున్నాయని, కొత్త రోడ్ల మాట ఎలా వున్నా అనకాపల్లి - నర్సీపట్నం ప్రధాన రహదారిలో నిలువు మేర పడిన గోతులను కప్పమంటూ ప్రయాణీకులు, వాహనదారులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో గోవాడ మసీదు దగ్గర, నరసయ్యపేట తదితర ప్రాంతాల్లో రోడ్డు వేశారు, ఇప్పుడు అవి కూడా గోతులుమయంగా మారాయి. నిత్యం వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అనకాపల్లి నుండి చోడవరం, నర్సీపట్నం వరకు ప్రయాణం చేస్తుంటారు. ఈ రహదారిలో ప్రయాణం నరక ప్రాయంగా మారడంతో నిత్యం నరకయాతన పడుతు న్నామని ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డులో ప్రయాణంతో తరచూ నడుం, వెన్ను నొప్పి వంటి అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని వారు ఆందోళన చెందుతున్నారు. 2024 ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే ధర్మ శ్రీ బాగు చేయించిన రోడ్లు కూడా గోతులు పడటంతో ఈ రహదారులు నరకానికి ఆనవాళ్ళుగా మారుతూ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధాన రహదారుల్లో నిలువు మేర గోతులు కారణంగా తరచూ వాహన ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతున్నారు, అవయవాలు కోల్పోయి వికలాంగులు అవుతున్నారు. కొత్త రోడ్ల మాట ఎలా ఉన్నను, ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి ప్రస్తుతం ఉన్న రోడ్ల లో ఏర్పడ్డ నిలువు లోతు గోతులను పూడ్చి, ఈ రహదారుల్లో ప్రమాదాలను నివారించి ప్రాణాలు కాపాడవలసిందిగా ప్రజా సంఘాలు, స్థానికులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

జీవీఎంసీ మేయర్ పీలాకు సత్కారం

విశాలాంధ్ర - కశింకోట: విశాఖ మహానగర పాలక సంస్థ మేయర్గా బాధ్యతలు చేపట్టిన పీలా శ్రీనివాసరావును మండల టీడీపీ అధ్యక్షుడు కాయల మురళీధర్ ఆధ్వర్యంలో ఆదివారం పీలా స్వగృహంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన వాళ్లకు గుర్తింపు ఉంటుందని, ఏ సమస్య వచ్చినా తనకు ఫోనే చేస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మేయర్ను కలిసి సత్కరించిన వారిలో ద్వారపురెడ్డి సత్తిబాబు, వక్కుర్తి సంతోష్, ఏరం శెట్టి రవి, అనాల తాతీయులు నాయుడు, నానాజీ తదితరులు ఉన్నారు.

అలరిస్తున్న వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - నర్సీపట్నం: శాఖా గ్రంథాలయం నర్సీపట్నంలో సమ్మర్ ఒరియంటేషన్ ప్రోగ్రామ్ ఆదివారం జరిగింది. గ్రంథాలయధికారిణి వి.దమయంతి విద్యార్థులచే కథల పుస్తకాలు చదివించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ ప్రతిదీనం వ్యాయామం చేయుటవలన కలిగే ఉపయోగాలను పిల్లలకు వివరించి, చిన్నచిన్న వ్యాయామం చేసి చూపించి, పిల్లలచేత చేయించారు. రిసోర్స్ పర్సన్ బిఎస్ ప్రసాద్ ఉపాధ్యాయుడు (సోషల్) తెలుగు బాష ప్రత్యేకతను వివరించారు. కొన్ని తెలుగు పద్యాలు పాడించి, వాటి అర్థాలు వివరించారు. బి.నరసింహమూర్తి, ఎస్ జి టి(తాళ్లపాలెం) పంచతంత్ర కథలు వలన మంచి నీతి కథలు వుంటాయని వివరించారు. సుమారు 25 మంది బాలబాలికలు హాజరయ్యారు.

పోలవరం ఎడమ కాలువ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - యస్.రాయవరం: పోలవరం ప్రాజెక్టులో భాగంగా నిలిచిపోయిన ఎడమ కాలువ పనులు ప్రారంభమయ్యాయి. మండలంలోని ఎడమ కాలువ కొంతమేర పనులు జరిగాయి. 2019 ముందు దార్లపూడి వద్ద వరహానదిపై అక్విడెక్టు నిర్మాణం 90 శాతం పూర్తయింది. ఆ తర్వాత పనులు నిలిచిపోవడంతో మరల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ నిర్మాణం పరిశీలించడం జరిగింది. త్వరలో ఈ పనులు ప్రారంభిస్తామని ప్రకటన చేసిన కొద్దిరోజులకే ఇరిగేషన్ అధికారులు పనులు ప్రారంభంలో భాగంగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం కొరకు పనులను ప్రారంభించారు. అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ముందుగా ఈ అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసిన తర్వాత మిగిలిన అక్విడెక్టు పూర్తి చేయడం జరుగుతుందని నిర్మాణ పనులు చేసే సిబ్బంది తెలిపారు.

రేషన్ డిపో ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చోడవరం: మండలలోని గవరవరం గ్రామంలో జాతీయ ప్రజా పంపిణీ పథకం కింద 0321041 ప్రభుత్వ చౌక ధరల దుకాణంను స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ప్రారంభించారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా ప్రజా అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వ చౌక ధరల దుకాణం విస్తరణ చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ బందారు రామలక్ష్మి, గ్రామ సర్పంచ్, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్మికులకు చీరల పంపిణీ

విశాలాంధ్ర - మునగపాక: మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో ప్రముఖ సంఘ సేవకులు కొయిలాడ దశావతారం వివాహ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సుమారు 250 మంది మహిళా కార్మికులకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయానికి తన వంతుగా రూ.60 వేల విరాళాన్ని గౌరీ యూత్ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలం టీడీపీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, జనసేన పార్టీ నాయకులు ఆడారి సత్యనారాయణ,ఆడారి శ్రీకాంత్, వాడ్రాపల్లి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కాండ్రేగుల నూక అప్పారావు, సూరిశెట్టి శివాజీ, కొయిలాడ రాంబాబు, ఆడారి బాలాజీ, మళ్ల శంకర్రావు, కొయిలాడ తేజ గౌరీ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు చిరు సత్కారం

విశాలాంధ్ర - మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో ఆడారి లక్ష్మీగణేష్ 586 మార్కులతో ప్రథమ స్థానంలో, 579 మార్కులతో బుదిరెడ్డి రేణుక రెండో స్థానంలో, 578 మార్కులతో టెక్కలి భాగ్యలక్ష్మి మూడో స్థానంలో నిలిచిన విద్యార్థులను సంతబయిల రామాలయం వద్ద తంపరమూల రైతు సంఘం అధ్యక్షుడు శరగడం జగన్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల మణికంఠ,ఆడారి గోవిందా, పెంటకోట శివ గణేష్, టెక్కలి ప్రసాద్, కాండ్రేగుల భాగ్యరాజు,దాడి నాయుడు, దాడి మురళి, విల్లూరి సోమ నాయుడు, దొడ్డి అప్పన్న, డీజే నాగరాజు, ఒమ్మి మాకినాయుడు, టెక్కలి చంద్ర, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పక్షి స్థావరాలతో ఎలుకల నివారణ

విశాలాంధ్ర - చీడికాడ: వరి చేనులో పక్షి స్థావరాలు ఏర్పాటు చేయడం వలన ఎలుకలు నివారించవచ్చునని శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల కింజారపు యర్రంనాయుడు వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చరల్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినిలు అన్నారు. మండలంలోని ఖండివరం గ్రామంలో రేబస్ కార్యక్రమంలో భాగంగా వరిచేనును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్థావరాలు ఏర్పాటు చేసుకొనుట ద్వారా రైతులు ఎలకలు నుండి తమ పంట నష్టాన్ని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు పడాల మౌనిక, మదన లలితఅభిజ్ఞ, అని ప్రియాంక, కొమ్ము మయూశా, వరసల అనుశ్రీ, గంద్రోతుల కృష్ణప్రియ రైతులు పాల్గొన్నారు.

పాల్తేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోరీ

- పాఠశాలలో చదువుతున్న విద్యార్థులే చోరీకి పాల్పడిన వైనం
- ఫ్యాన్లు, ట్యాపులు దొంగిలించే ప్రయత్నం
- పట్టుకున్న స్థానికులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చోరీకి పాల్పడ్డారు. అదే పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు చోరీకి పాల్పడినట్టు ఆలస్యంగా తెలియ వచ్చింది. వేసవి సెలవులు దృష్ట్యా పాఠశాలకు తాళాలు వేసి ఉంచారు. అయితే పాఠశాలలో చొరబడిన విద్యార్థులు తాళాలు పగలగొట్టి, తరగతి గదుల్లో ఫ్యాన్ రెక్కలు ధ్వంసం చేశారు. ఫ్యాన్ రెక్కలు విరగగొట్టేందుకు ప్రయత్నం చేయగా అవి రాకపోవడంతో ఫ్యాన్ రెక్కలను వంచి వేశారు. అలాగే మోటారు స్విచ్ బోర్డు, విద్యుత్ స్విచ్ బోర్డులను ధ్వంసం చేశారు. పాఠశాలలో ఉన్న తాగునీరు సరఫరా చేసే పైపులైన్లకు ఉన్న ట్యాపులు విరకొట్టారు. వీటన్నిటిని స్కూల్ బ్యాగ్ లో వేసుకుని అమ్మకానికి తీసుకెళ్తుండగా స్థానికులు పట్టుకున్నారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లగా, హెచ్ఎం వారి తల్లిదండ్రులకు సమాచారం అందిం చారు. జరిగిన నష్టానికి డబ్బులు చెల్లిస్తామని తల్లిదండ్రులు చెప్పినట్లు సమాచారం. పాఠశాలలో వాచ్ మెన్ ఉన్నప్పటికీ చిన్న చిన్న దొంగతనాలు జరగటం సర్వసాధారణం అయిందని ఉపాధ్యాయులే చెబుతు న్నారు. గతంలో ఆఫీస్ రూమ్ తాళాలు పగలగొట్టారని, బెల్లు తీసుకెళ్లి అమ్మే ప్రయత్నం చేశారని ఉపాధ్యాయులు చెప్తున్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్ఎం అన్నపూర్ణను వివరణ కోరగా పాఠశాల సెలవు రోజుల్లో కొంతమంది విద్యార్థులు చొరబడి తరగతి గదులకు ఉన్న తాళాలు పగలగొట్టి ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు దొంగిలించే ప్రయత్నంలో ధ్వంసం చేశారని, ట్యాపులు విరగ్గొట్టి పట్టుకెళ్లారని తెలిపారు. ఇటువంటి సంఘటనలకు పాల్పడిన విద్యార్థుల తల్లిదండ్రులను అడిగితే జరిగిన నష్టానికి డబ్బులు చెల్లిస్తామని తెలిపారని అన్నారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారికి తెలియజేసినట్లు హెచ్ఎం తెలిపారు.

పూర్వ విద్యార్థినీల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల 2004 -2005 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు అపూర్వ కలయిక జరిగింది. ఆదివారం ప్రత్యేకంగా ఈ విద్యార్థులు సమావేశం ఏర్పాటు చేసుకొని చదువుకున్న సమయంలో జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు, తోటి స్నేహితుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన కర్రి తులసి, శ్రీదేవి ,దుర్గాదేవి, నందీశ్వరి, సువర్ణ, గంగాభవాని, పద్మ, రుక్మిణి, దీపిక పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్ చేసిన వ్యక్తిని పట్టుకున్న శక్తి టీమ్

కౌన్సిలింగ్ నిర్వహించి కఠిన హెచ్చరికలు

విశాలాంధ్ర - కశింకోట మహిళల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుంటూ, జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మార్గదర్శకత్వంలో, డిఎస్పీ శ్రీమతి ఎం.శ్రావణి పర్యవేక్షణలో ఏర్పాటైన శక్తి టీమ్‌లు మహిళలపై వేధింపులు, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలపై వేగంగా స్పందించేందుకు కట్టుబడి ఉన్నాయి. ఇటీవల, తాళ్ళపాలెం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని శక్తి టీమ్‌కు ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన ప్రకారం, కశింకోట మండలం, తేగాడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తరచూ తనను ఈవ్ టీజింగ్ చేస్తున్నాడని విన్నవించింది. ఈ సమాచారం అందిన వెంటనే, శక్తి టీమ్ ఇన్‌చార్జ్ ఎస్సై శ్రీ పి.మనోజ్ కుమార్ నేతృత్వంలో హెచ్.సీ మల్లీశ్వరి, పి.సి దీపిక, పి.సి కొండలరావు, పి.సి అప్పలాచార్య, పి.సి నాయుడు వంటి పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి, సంబంధిత వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ అతనికి చట్టపరమైన శిక్షల గురించి వివరించి, కౌన్సిలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి చర్యల వల్ల ఎదురయ్యే తీవ్ర పరిణామాల గురించి హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ. మహిళలు, విద్యార్థినులు ఎటువంటి భయాలకు లోను కాకుండా శక్తి యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేస్తే, వెంటనే మా శక్తి టీమ్స్ ద్వారా తక్షణ చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా తెలిపారు.మహిళల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేదు. శక్తి టీమ్ ఎల్లప్పుడూ బాధితుల పక్షంలో నిలుస్తుంది" అని శక్తి టీమ్ సభ్యులు పేర్కొన్నారు.

పెందుర్తి నియోజకవర్గం

వైసిపి కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని ఇరువాడ పంచాయతీ పరిధిలో పెట్రోల్ బంకు సమీపంలో పెందుర్తి నియోజకవర్గం వైఎస్ఆర్ సిపి కేంద్ర కార్యాలయం ఆదివారం ప్రారంభోత్సవం జరిగింది. పాత రోడ్డు జంక్షన్ నుండి కేంద్ర కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్,పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అధిప్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ముందుగా వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, వైసిపి కేంద్ర కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడిచిన ఇంతవరకు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను, హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతిపక్ష నాయకులపై కక్షపూరిత చర్యలు, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజు మాట్లాడుతూ తమ పార్టీ ప్రజలకు కార్యకర్తలకు అండగా నిలవాలని, ప్రజల యొక్క సమస్యలు పరిష్కారానికి తమ కార్యాలయంలో వైసిపి నేతలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని అన్నారు. కార్యకర్తలు, ప్రజలు అందరూ కలిసికట్టుగా పనిచేసి 2029 సంవత్సరానికి వైఎస్ఆర్సిపి జెండా రెపరెపలాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ వైసిపి నాయకులు గండి రవికుమార్, మాజీ కార్పొరేటర్లు సరగడం అప్పలనాయుడు, చొప్ప నాగరాజు, వైసిపి సీనియర్ నేత బయలుపూడి భగవాన్ జయరాం,పరవాడ ఎంపీపీలు బోకం సూర్యకుమారి రామనాయుడు, పైల శ్రీనివాసరావు, ఉగ్గిన కనకరాజు, మాజీ జెడ్పిటిసి కొటాన రాము, మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, వైసిపి సీనియర్ నేతలు సబ్బవరపు ముత్యాల నాయుడు, పాలిశెట్టి సురేష్ వద్దాది అప్పలరాజు, బోను గంగు నాయుడు, సర్పంచులు,ఎంపీటీసీలు,పెందుర్తి నియోజకవర్గం వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కోదండ సీతారామస్వామి ధ్వజ, విగ్రహ సహిత పశిడి కలశ ప్రతిష్ట

విశాలాంధ్ర - సబ్బవరం :మండలంలోని టెక్కలిపాలెం గ్రామంలో అనకాపల్లి జిల్లా, సబ్బవరం మండలం, టెక్కలిపాలెం గ్రామంలో శ్రీ గణపతి శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవతా సహిత శ్రీ కోదండ సీతారామస్వామి, ధ్వజ మరియు విగ్రహ సహిత పశిడి కలశ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం ఉదయం వేద పండితులుచే ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయ కర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ , పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకొని స్వామివారి తీర్థప్రసాదములు తీసుకున్నారు.అనంతరం రామాలయం ఉత్సవ కమిటీ నిర్వాహకులు వారికీ జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొంప సత్యవమ్మ నాయనప్ప, మాజీ సర్పంచ్లు పంచాడ శ్రీనివాసరావు,కోటానవెంకటరమణ మాజీ ఎంపీటీసీ పైల రమణ, వైసీపీ నేతలు బోకం రామునాయుడు కోటాన రాము, పాలిశెట్టి సురేష్,మోపాడ అప్పారావు, వద్దాది అప్పలరాజు, బోను గంగునాయుడు, కోటాన వెంకటరమణ, సిరపరపు వాసు, గండి రవికుమార్ యువసైన్యం ఉన్నారు.

ఘనంగా శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం ప్రారంభం

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని నారపాడు గ్రామంలో శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభోత్సవం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్,నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ ముఖ్య అతిథిలగా పాల్గొని స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ

స్వామి వారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలు అందరి పైన ఎల్లప్పుడూ ఉండాలని , అందరూ సుభిక్షంతో మెలగాలని ఆ స్వామివారిని కోరుకున్నారు.ఆయనతో పాటు స్థానిక ఎంపీటీసీ రాపేటి అరుణ రాము , సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ ధెద్దం ప్రసాద్ , మాజీ సర్పంచ్ తాసుబిల్లి కనకరాజు , మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సేనాపతి దుర్గ అప్పారావు వైస్సార్సీపీ నాయకులు గొర్లె రాజేష్ , సిరపరపు వాసు , బత్తిన వెంకట్ ,గండి రవికుమార్ యువసైన్యం ఉన్నారు.

కొత్తమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో వెంకటాపురం గ్రామంలో శ్రీ కొత్తమ్మతల్లి ఆలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు .ఆదివారం ఉదయం గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో పురోహితులు పూజలు చేసిన అనంతరం శంకుస్థాపన చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం, మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ,గ్రామ పెద్దలు మరిశా త్రిమూర్తులు, ముప్పిన శ్రీను, నరసారావు మూర్తి, నీరుకొండ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి పండుగ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో గుర్రాజుపేట గ్రామంలో సత్తెమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఆలయముకు వచ్చి దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, మాజీ సర్పంచులు ఎన్. వెంకట్రాజు, కురందాసు శ్రీను, టిడిపి సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ ,జి.రంగా తదితరులు పాల్గొన్నారు .

శ్రీ కోదండ సీతారామస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని టెక్కలిపాలెం గ్రామంలో శ్రీ కోదండ సీతారామస్వామి, ధృజ, విగ్రహ సహిత పశిడి కలశ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం ఉదయం వేద పండితులుచే ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుకు రామాలయం ఉత్సవ కమిటీ

నిర్వాహకులు సీతారాములు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొంప సత్యవమ్మ నాయనప్ప, మాజీ సర్పంచ్లు పంచాడ శ్రీనివాసరావు, కోటానవెంకటరమణ మాజీ ఎంపీటీసీ పైల రమణ, కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ,సాలాపు వెంకటేశ్వరరావు, కర్రీ కనకరాజు, గండి దుర్గాప్రసాద్,బైలపూడి దేముడు, మామిడి శంకర్రావు,బంతి కోళ్ల పద్మ,సింగంపల్లి శ్రీనివాసరావు, టి.శేఖర్,మంగరాజు, జె ప్రసాద్,దాడి కన్నామనాయుడు, కూటమి కార్యకర్తలు, వీర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నవ్వుల నజరానా లాఫింగ్ క్లబ్

విశాలాంధ్ర - అనకాపల్లి: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఈ ఆదివారం లాఫింగ్ క్లబ్ కార్యక్రమం పార్క్ సెంటర్ వద్ద ఉన్న శ్రీ మళ్ళ జగన్నాథం కళ్యాణమండపంలో అత్యంత రసరమ్యంగా జరిగిందని దాడి వాసు,బొడ్డేడ మురళి అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా జబర్దస్త్ సత్తిపండు ఎఫ్ఎం బాబాయ్ విచ్చేసి తన హాస్యంతో హాస్య ప్రియులందరినీ నవ్వించారు.అనంతరం అనకాపల్లి లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన హైదరాబాద్ జబర్దస్త్ టీం వారిచే నవ్వుల నజరానా చాలా బాగా జరిగిందని హాస్య ప్రియులందరినీ అలరింపజేశాయని అధ్యక్ష కార్యదర్శులు వాసు, మురళి అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సంఘ సేవకులు కాండ్రేగుల శ్రీరామ్ ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ అధినేత డాక్టర్ వెంకట పార్వతీశం పాల్గొని జబర్దస్త్ నటులందరినీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినకోట బుచ్చిరాజు కొణతాల పూర్ణచంద్రరావు విల్లూరి సంతోష్ కుమార్ రాపేటి నారాయణరావు, వుద్దగిరి శ్రీనివాసరావు భీమరశెట్టి వరాహ దాడి సూరిబాబు దావన్ పాల్గొన్నారు.